నమస్తే తెలంగాణ
యాదాద్రి భువనగిరి
13 హైదరాబాద్, గురువారం 22 ఫిబ్రవరి 2024 YADADRI BHUVANAGIRI




## పోలీస్ కొలువు విలువలతో కూడుకున్నది : ఎస్పీ చందనా దీప్తి

నీలగిరి, ఫిబ్రవరి 21 : పోలీస్ కొలువు విలువలతో కూడుకున్నదని, నిరుపేదలకు అండగా నిలిచేందుకు, న్యాయం అందించడం పోలీస్ శాఖ ద్వారానే సాధ్యమని జిల్లా ఎస్పీ చందనా దీప్తి అన్నారు. పోలీస్ శాఖలో ఉద్యోగం సాధించినందుకు గర్వపడడంతోపాటు జవాబుదారీ తనంతో పనిచేసి శాఖకు పేరు ప్రతిష్టలు తేవాలని సూచించారు. జిల్లా పోలీస్ శిక్షణ కేంద్రంలో సంగారెడ్డి, కామారెడ్డి, వికారాబాద్ జిల్లాల నుంచి ఏఆర్ విభాగానికి ఎంపికైన 203 మందికి 9నెలలపాటు సాగే శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం ఆమె జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వేలాది మంది అభ్యర్థులతో పోటీపడి ఎంపికైన కానిస్టేబుళ్లు క్రమశిక్షణతో శిక్షణ పూర్తి చేసుకోవాలన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ప్రజా సేవ చేస్తూ సమాజంలో మంచి గుర్తింపు పొందాలని సూచించారు.

కార్యక్రమంలో డీటీసీ ప్రిన్సిపాల్, అడిషనల్ ఎస్పీ రాములునాయక్, వైస్ ప్రిన్సిపాల్, డీఎస్పీ విఠల్‌రెడ్డి, ఎస్‌బీ డీఎస్పీ రమేశ్, సైబర్ క్రైమ్ డీఎస్పీ లక్ష్మీనారాయణ, సీఐలు గోపి, సత్యనారాయణ, కొండల్‌రెడ్డి, కరుణాకర్, ఆర్ఐలు హరిబాబు, సూరప్ప నాయుడు, ఎస్ఐలు, ఆవుట్‌డోర్, ఇన్‌డోర్ సిబ్బంది పాల్గొన్నారు.

# నయనానందం ఎదుర్కోలు సంబురం

- నిశ్చయ తాంబూలాల ఒప్పందం
- లక్ష్మీదేవికి పూలు, పండ్ల కార్యక్రమం
- ఘనంగా సింహ వాహన సేవ, అశ్వవాహన సేవ
- నేడు పూర్వగిరి లక్ష్మీనరసింహుడి తిరు కల్యాణ మహోత్సవం

యాదగిరిగుట్ట, ఫిబ్రవరి21 : పాతగుట్ట లక్ష్మీనరసింహ స్వామి ఎదుర్కోలు మహోత్సవం బుధవారం రాత్రి అంగరంగ వైభవంగా జరిగింది. స్వామి వారి కల్యాణం, నిశ్చయ తాంబూలాలకు ఒప్పందం కుదుర్చారు. గురువారం రాత్రి 9 గంటలకు కల్యాణ సుముహూర్త గడియలుగా నిర్ణయించారు. నరసింహుడి వర పూజ, వధువు లక్ష్మీదేవికి పూలు, పండ్ల కార్యక్రమాన్ని అర్చకులు కనులపండువగా నిర్వహించారు. ఎదుర్కోలు మహోత్సవం నయనానందంగా జరుగగా భక్తులు వీక్షించి తరించారు. శ్రీవారు, అమ్మవారు గుణగణాలను అర్చకులు వర్ణించారు. జీవకోటిని ఉద్ధరించేందుకు స్వామి శ్రీవారు ఉదయం సింహవాహనంపై, రాత్రి అశ్వవాహనంలో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు.


సింహ వాహనంపై స్వామివారి ఊరేగింపు


స్వామి, అమ్మవార్లకు ఎదుర్కోలు మహోత్సవాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

### ఎదురెదురుగా అధిష్టింపజేసి..

బుధవారం రాత్రి 8 గంటలకు పట్టువస్త్రాల అలంకరణలో అశ్వవాహన సేవపై నారసింహ స్వామి, ముత్యాల పల్లకిపై లక్ష్మీదేవి ఆలయం నుంచి ఊరేగింపుగా వెళ్లారు. మేళతాళాల నడుమ ప్రధాన మండపానికి చేరారు. ఎదురెదురుగా స్వామి, అమ్మవార్లను అధిష్టింపజేసి, శ్రీవారి వైపు ఆలయ ఈఓ రామకృష్ణారావు, అమ్మవారి వైపు ఆలయ అనువంశిక ధర్మకర్త భాస్కరాయణి నరసింహమూర్తి పెళ్లి పెద్దలుగా వ్యవహరించారు. ప్రధానార్చకులు నల్లన్‌థీఘల్ లక్ష్మీనరసింహాచార్యులు, కాండూరి వేంకటాచార్యులు, అర్చక బృందం వైష్ణవ సంప్రదాయ రీతిలో కల్యాణ ఒప్పందాన్ని కుదిర్చారు.

### పెండ్లి కుమారుడిగా నారసింహ స్వామి

పాతగుట్ట బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం లక్ష్మీనరసింహుడు పెండ్లి కుమారుడయ్యాడు. రాత్రి ఎదుర్కోలు కోసం ముందస్తుగా పెండ్లి కుమారుడిని చేసి గురువారం జరిగే తిరుకల్యాణ మహోత్సవానికి రంగం సిద్ధం చేశారు. ఉదయం పెండ్లి కొడుకైన శ్రీవారిని సింహవాహన అలంకార సేవలో భక్తుల సందర్శనార్థం తిరు వీధుల్లో ఊరేగించారు. ఉదయం తిరుమంజన ఉత్సవం జరిపి, శ్రీవారిని సింహవాహన సేవలో ఊరేగించారు. సింహ వాహన విశిష్టతను ఆలయ ప్రధానార్చకులు వివరించారు. ఈ వేడుకల్లో ఆలయ అనువంశిక ధర్మకర్త బి. నరసింహమూర్తి, డీఈఓ దోర్బల భాస్కర్‌శర్మ, ఏఈఓ గజవెల్లి రమేశ్‌బాబు, యాజ్ఞికులు కిరణ్ కుమారాచార్యులు, ఉప ప్రధానార్చకులు మాధవాచార్యులు, శ్రీధరాచార్యులు, అధ్యాపకులు నల్లన్‌థీఘల్ సీతామనోహరాచార్యులు, పారాయణందారులు నర్సింహాచార్యులు, జగన్‌మోహనాచార్యులు, వేణగోపాలాచార్యులు, ఆలయ అధికారులు శ్రీధర్, విజయ్, వేద పండితులు పాల్గొన్నారు.

### అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

పాతగుట్ట బ్రహ్మోత్సవాల్లో భాగంగా గుండ్లపల్లికి చెందిన వీర ప్రతాప భజన మండలి, యాదగిరిగుట్టకు చెందిన భాగ్యలక్ష్మీ భజన మండలి ఆధ్వర్యంలో భజన కార్యక్రమం, కుమారి ఏలూరి యామిని కూచిపూడి నృత్య ప్రదర్శన, రమేశ్ రాజు డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో నృత్య ప్రదర్శనలు అలరించాయి.

### తిరుకల్యాణ మహోత్సవానికి అంతా సిద్ధం

లక్ష్మీనరసింహ స్వామి తిరుకల్యాణ మహోత్సవం గురువారం రాత్రి వైభవంగా నిర్వహించేందుకు దేవస్థానం అధికారులు ఏర్పాట్లు చేశారు. పాతగుట్ట ఆలయ ప్రాంగణంలో గల కల్యాణ మండపాన్ని రంగులు అద్ది, పూలు, అరటి మట్టలు, మామిడి తోరణాలు, విద్యుద్దీపాల అలంకరణ, సౌండ్ సిస్టంతో ముస్తాబు చేశారు. కల్యాణాన్ని వీక్షించేందుకు, భక్తులు కూర్చునేందుకు సకల వసతులు కల్పించారు. నరసింహ స్వామి ఉదయం హనుమంత సేవలో, రాత్రి 8 గంటలకు గజ వాహనంలో ఊరేగుతూ కల్యాణ మహోత్సవానికి తరలివస్తారు.


తుర్కపల్లి మండలంలోని గంధమల్ల గ్రామం

# గంధమల్లలో ఒక టీఎంసీనే బెటర్

- 4.28 టీఎంసీలకు పెంచితే ముంపులోకి రెండు గ్రామాలు
- మునిగిపోనున్న వందల ఎకరాల పంట పొలాలు
- ఆందోళనలో గంధమల్ల, వీరారెడ్డిపల్లి గ్రామస్తులు
- రిజర్వాయర్‌గా మార్చాలన్న ఎమ్మెల్యే బీర్ల అయిలయ్యపై ఆగ్రహం
- అదే జరిగితే మరో ఉద్యమం తప్పదంటూ హెచ్చరికలు

తుర్కపల్లి, ఫిబ్రవరి21 : కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా మండలంలోని గంధమల్ల రిజర్వాయర్ నిర్మాణానికి గత ప్రభుత్వం శ్రీకారం చుట్టగా టీఎంసీల సామర్థ్యాన్ని పెంచొద్దని ప్రజలు, రైతుల నుంచి వ్యతిరేకత రావడంతో వెనక్కు తగ్గింది. స్థానికంగా ఇబ్బందులు రాకుండా ప్రతిపాదనలు రూపొందించింది. కానీ స్థానిక ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య టీఎంసీల సామర్థ్యం పెంచి రిజర్వాయర్ నిర్మించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేయడంతో వివాదాస్పదంగా మారింది. దాంతో రైతులు, ప్రజలు బీర్ల అయిలయ్యపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### ప్రతిపాదనల్లో మార్పు చేసిన గత ప్రభుత్వం

కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో భాగంగా 15వ ప్యాకేజీ నుంచి తుర్కపల్లి మండలంలోని గంధమల్ల గ్రామ చెరువును నింపాలని గత బీఆర్ఎస్ ప్రభుత్వం సంకల్పించింది. 9.86 టీఎంసీల సామర్థ్యంతో జలశయాన్ని నిర్మించాలని నిర్ణయించి అందుకు కావాల్సిన పరిపాలన అనుమతులు, టెండర్ల ప్రక్రియను ప్రారంభించింది. దాని కోసం రూ. 860.25 కోట్లు మంజూరు చేసింది. రిజర్వాయర్ వల్ల సుమారు 4,027 ఎకరాల వ్యవసాయ, ఆటవీ శాఖ భూములతోపాటు గంధమల్ల, వీరారెడ్డిపల్లి గ్రామాలు పూర్తిగా ముంపునకు గురవుతాయని యోచించింది. ఇందుకు అక్కడి రైతులు, గ్రామస్తులు తీవ్రంగా వ్యతిరేకించారు. దాంతో వెనక్కు తగ్గిన అప్పటి బీఆర్ఎస్ సర్కార్ 4.28 టీఎంసీల సామర్థ్యానికి కుదించి గంధమల్లను రీ డిజైన్ చేసింది. ఇందుకోసం రూ. 569.60 కోట్లు మంజూరు చేసింది. దీని ద్వారా కేవలం గంధమల్ల గ్రామంతోపాటు చుట్టూ ఉన్న 2,500 ఎకరాల వ్యవసాయ, అటవీ భూములు ముంపు బారిన పడే అవకాశం ఉంది. ఈ డిజైన్‌ను సైతం అక్కడి గ్రామస్తులు తీవ్రంగా వ్యతిరేకించడంతో చేసేదేమీ లేక గంధమల్ల జలాశయం పనులను గత ప్రభుత్వం నిలిపివేసింది. ప్రస్తుతం 0.002 టీఎంసీ సామర్థ్యంతో ఉన్న గంధమల్ల చెరువులోకి కాళేశ్వరం జలాలను అందించాలనే ఉద్దేశంతో ప్రధాన కాల్వ పనులు చేపట్టగా ప్రస్తుతం కొనసాగుతున్నాయి.

### చివరికి 1.48 టీఎంసీకి నిర్ణయం

4.28 టీఎంసీల సామర్థ్యానికి కుదించి గంధమల్లను రీ డిజైన్ చేసినా ప్రజల నుంచి వ్యతిరేకత రావడంతో 1.48 టీఎంసీల సామర్థ్యంతో జలాశయాన్ని నిర్మించాలని బీఆర్ఎస్ సర్కారు మళ్లీ ఒక ఆలోచనకు వచ్చింది. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించింది. ప్రభుత్వం మారడంతో ప్రస్తుత కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య అసెంబ్లీ వేదికగా 4.28 టీఎంసీల సామర్థ్యంతో జలాశయాన్ని నిర్మించాలని, ఇందుకు సంబంధించిన నిధులను మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. దాంతో గంధమల్ల రైతులు, ప్రజలు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్యపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తమ గ్రామాలు, తమ పంట పొలాలను ముంపునకు గురి చేసి గంధమల్ల జలాశయాన్ని నిర్మిస్తామంటే ఊరుకునేది లేదని, మరో ఉద్యమానికి శ్రీకారం చుడుతామని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్నారు. ఒక టీఎంసీ సామర్థ్యంతోనే జలాశయాన్ని నిర్మించాలని కోరుతున్నారు.

### రిజర్వాయర్ నిర్మిస్తే భూములు కోల్పోతాం



ప్రభుత్వం గంధమల్ల చెరువును రిజర్వాయర్‌గా నిర్మిస్తే ఉన్న ఊరితోపాటు పంటపొలాలు కోల్పోయి రోడ్డున పడుతాం. ఎమ్మెల్యే దీనిపై రెండు విధాలుగా మాట్లాడడం సరికాదు. రిజర్వాయర్ నిర్మాణంపై స్పష్టమైన ప్రకటన చేయాలి. రైతులు, ప్రజలకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలి.

– గడిపె ఇస్తారి, గంధమల్ల, తుర్కపల్లి మండలం

### ఉన్న చెరువును అభివృద్ధి చేస్తే సరిపోతుంది



ప్రస్తుతం ఉన్న చెరువుకు మరమ్మతులు చేపట్టి కొంత వెడల్పు చేసి అభివృద్ధి చేస్తే సరిపోతుంది. ఉన్న చెరువు నీటితోనే మా ప్రాంతంలో భూగర్భ జలాలు పుష్కలంగా ఉన్నాయి. పంటలకు ప్రస్తుతం ఏ ఇబ్బందీ లేదు. చెరువును అభివృద్ధి చేసి కాల్వల పునరుద్ధరణ చేపడితే రాజాపేటతోపాటు ఇతర మండలాలకు సైతం ఇక్కడి నుంచి కాళేశ్వరం జలాలు పోతాయి.

– అనుముల వెంకట్‌రెడ్డి, మాజీ సర్పంచ్, గంధమల్ల



# జీతాలు మహాప్రభో..

- కొత్త ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలకు నిలిచిన వేతనాలు
- రెండు నెలలుగా ఎదురుచూపులు
- కుటుంబాల పోషణకు కష్టాలు
- ఇచ్చిన హామీ నిలుపుకోవాలంటున్న అంగన్‌వాడీలు

కరీంనగర్, ఫిబ్రవరి 21 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): 'ఓడెక్కె దాకా ఓడ మల్లన్న.. ఓడ దిగినంక బోడి మల్లన్న' అన్నట్టుగా ఉన్నది కాంగ్రెస్ ప్రభుత్వ తీరు. శాసనసభ ఎన్నికలకు ముందు ఇష్టారాజ్యంగా హామీలు గుప్పించిన ఆ పార్టీ, ఇప్పుడు అమలులో మాత్రం చోద్యం చూస్తున్నది. తాము అధికారంలోకి వస్తే వేతనాలు పెంచడంతోపాటు ప్రభుత్వోద్యోగులతో కలిపి ఏ నెలకు ఆ నెల విడుదల చేస్తామంటూ హామీ ఇచ్చినా.. తీరా గెలిచిన తర్వాత జీతాలు పెంచడం దేవుడెరుగు? ఉన్న జీతాలు కూడా సక్రమంగా ఇవ్వడం లేదు. ఫలితంగా అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు రెండు నెలలుగా జీతాల కోసం ఎదురు చూడాల్సి వస్తున్నది.

### నాడు ఆదుకున్న కేసీఆర్ సర్కారు

గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందిస్తూ, ఆరేళ్లలోపు బాలలకు ఆటాపాటలతో కూడిన పూర్వ ప్రాథమిక విద్యనందిస్తున్నారు అంగన్‌వాడీలు. అలాగే, ప్రభుత్వం నిర్వహించే పలు సర్వేలు, ఇతర ప్రభుత్వ కార్యక్రమాలు కూడా చేస్తుంటారు. అయినా నాటి ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్‌వాడీలను పూర్తిగా నిర్లక్ష్యం చేశాయి. వేతనాలు పెంచాలని అనేక ఆందోళనలు చేసినప్పుడల్లా కంటి తుడుపుగా రూ.100 నుంచి రూ.200 పెంచేవారు. అవి ఏ మూలకూ సరిపోక ఇబ్బంది పడేవారు. కానీ, కేసీఆర్ సర్కారు వచ్చిన తర్వాత ఆ పరిస్థితి మారింది. గర్భిణిలు, బాలింతలు, పిల్లలకు పౌష్టికాహారాన్ని అందించే కీలకమైన సేవల్లో ఉన్న అంగన్‌వాడీలకు సముచిత స్థానం కల్పించింది. కేంద్రంతో నిమిత్తం లేకుండా ఈ చిరుద్యోగుల సంక్షేమాన్ని చూసుకున్నది. తెలంగాణ వచ్చినప్పుడు అంగన్‌వాడీ టీచర్లకు కేవలం రూ.3,200, హెల్పర్లకు ఇంకా తక్కువ వేతనం ఉండగా, రాష్ట్రం వచ్చిన వెంటనే వీరికి వేతనాలు పెంచింది. టీచర్లకు నెలకు రూ.13,650, హెల్పర్లకు రూ.7,800 వేతనం అందించింది. దేశంలో ఏ రాష్ట్రంలో కూడా ఇంతగా వేతనాలు పెంచలేదు. ఆ తర్వాత ప్రభుత్వోద్యోగులకు ఇస్తున్నట్టుగా రెండు సార్లు పీఆర్సీ అమలు చేసింది. కరోనా విపత్కర కాలంలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దెబ్బతిన్నా.. సంక్షేమాన్ని మాత్రం ఆపలేదు. ఉద్యోగులకు అటో ఇటో వేతనాలు కాస్త ఆలసమయ్యాయి కానీ, ఏ నెల కూడా వేతనాలు ఆపలేదు.

### నేడు జీతాల కోసం ఎదురుచూపు

ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఎన్నో హామీలిచ్చింది. తాము అధికారంలోకి వస్తే వేతనాలు పెంచుతామని, ప్రభుత్వోద్యోగులతో కలిపి ఏ నెలకు ఆ నెల విడుదల చేస్తామంటూ హామీ ఇచ్చింది. ఇంకా ఒకటో తారీఖే వేస్తామని చెప్పింది. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 75 రోజులు గడిచింది. కానీ, ఇప్పటికీ వరకు అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లకు జీతాలు విడుదల చేయలేదు. రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 35వేల సెంటర్లలో పనిచేస్తున్న దాదాపు 65 వేల అంగన్‌వాడీలు రెండు నెలలుగా జీతాల కోసం ఎదురుచూస్తున్నారు. జీతాలు పెంచడమేమో గానీ, ఉన్న జీతాలు కూడా సక్రమంగా పంపిణీ చేయడం లేదని మండిపడుతున్నారు. ప్రస్తుతం తమ పరిస్థితి పెనంపై నుంచి పొయ్యిలో పడ్డట్టుగా మారిందని కన్నీటి పర్యంతమవుతున్నారు. జీతాలు లేక తమ కుటుంబాల పరిస్థితి కడుదయనీయంగా మారతున్నదని, అప్పులు చేయాల్సి వస్తున్నదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాము ఎదుర్కొంటున్న పరిస్థితులపై కాంగ్రెస్ పార్టీ నాయకుల ఎదుట అయినా గోడు వెళ్లబోసుకుందామంటే, కనీసం వారిని కలిసే సమయం కూడా ఇవ్వడం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం తమకు సత్వరమే జీతాలు విడుదల చేసి ఆదుకోవాలని కోరుతున్నారు.

# గద్దెనెక్కిన సారలమ్మ

- శివసత్తుల పూనకాలతో పరవశించిన చిన్న మేడారం
- జాతరకు పోటెత్తిన భక్తజనం
- నేడు కొలువు దీరనున్న సమ్మక్క


చిన్నమేడారం సారలమ్మ గద్దె వద్ద మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

రాజాపేట, ఫిబ్రవరి 21 : భక్తులకు కొంగు బంగారంగా విరాజిల్లుతున్న వన దేవతలైన సమ్మక్క, సారక్క జాతర రాజాపేట మండలంలోని చిన్నమేడారంలో వైభవంగా కొనసాగుతుంది. అడవి తల్లుల జన జాతరలో రెండో రోజు కుర్రారం గ్రామ శివారులోని ఎదులగుట్టపై సమ్మక్క కూతురైన సారలమ్మకు పూజారులు సాంప్రదాయ పూజలు నిర్వహించి డప్పుచప్పుళ్లు, డోలు వాయిద్యాలు, శివసత్తుల పూనకాల మధ్య అంగరంగ వైభవంగా గద్దెపైకి తీసుకొచ్చారు. వన దేవత గద్దెపై ఆసీనులయ్యే సమయంలో ఆ ప్రాంతమంతా శివసత్తుల పూనకాలు, భక్తిభావంతో పులకించిపోయింది. సారలమ్మ తల్లి చల్లంగా దీవించుమని భక్తజనం వేడుకున్నది. గద్దెపై ఆసీనులైన సారలమ్మకు భక్తులు నిలువెత్తు బంగారం, పసుపు, కుంకుమ, గాజులు, ఒడి బియ్యం సమర్పించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులు కాలినడకన, ట్రాక్టర్లు, ఆటోలు, ప్రైవేటు వాహనాల్లో తల్లుల సన్నిధికి పెద్ద ఎత్తున చేరుకోవడంతో చిన్నమేడారం భక్తజనంతో పోటెత్తింది.

### నేడు గద్దెపైకి సమ్మక్క తల్లి..

ఆదిపరాశక్తి అయిన సమ్మక్క తల్లి గురువారం బూర్గుపల్లి పులిగుట్టపై నుంచి గద్దెపైకి రానుంది. తల్లి గద్దెలపై కొలువుదీరే సమయంలో ఆలయ ప్రాంతం జనసంద్రమవుతుంది. ఆడవి తల్లులు గద్దెలను తాకి పునీతం చేసుకోవాలని భక్తులు పెద్ద ఎత్తున తరలివస్తారు. జాతరలో అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా యాదగిరిగుట్ట సీఐ వేణుగోపాల్, ఎస్ఐ సుధాకర్ రెడ్డి ఆధ్వర్యంలో భారీ బందోబస్తు నిర్వహించారు.

### సీతారాంపురం మినీ మేడారం జాతర ప్రారంభం

గుండాల : మండలంలోని సీతారాంపురం సమ్మక్క, సారలమ్మ మినీ మేడారం జాతర ప్రారంభమైంది. బుధవారం మాసాన్‌పల్లి నుంచి సారలమ్మను డప్పుచప్పుళ్లు, డోలు వాయిద్యాలతో సీతారాంపురం గద్దెపైకి తీసుకొచ్చారు. గురువారం ఎర్రబోళ్లగుట్ట నుంచి సమ్మక్క గద్దెకు చేరుకోనున్నట్లు ఆలయ పూజారి వట్టిపల్లి భిక్షపతి తెలిపారు. 23న సమ్మక్క, సారలమ్మ, గోవింద రాజు, పగిడిద్దరాజు భక్తులకు దర్శనం ఇస్తారని, 24న తిరిగి వన ప్రవేశం చేస్తారని చెప్పారు. జాతరకు పెద్ద సంఖ్యలో వస్తున్న భక్తులకు తాగునీటి వసతులు, ఇతర సౌకర్యాలు కల్పించారు. వన దేవతలకు భక్తులు ఒడి బియ్యం, బంగారం, పసుపు, కుంకుమ సమర్పించి మొక్కులు తీర్చుకోనున్నారు.


వన దేవతలకు బంగారం సమర్పించుకోవడానికి వెళ్తున్న భక్తులు


చెర్వుగట్టులో ఊరేగుతున్న పార్వతీ రామలింగేశ్వర స్వామి

# కనుల పండువగా గ్రామోత్సవం

- చెర్వుగట్టు బ్రహ్మోత్సవాలు పరిపూర్ణం

నార్కట్‌పల్లి, ఫిబ్రవరి 21 : చెర్వుగట్టు పార్వతీ జడల రామలింగేశ్వర స్వామి దేవస్థాన వార్షిక బ్రహ్మోత్సవాలు గ్రామోత్సవంతో బుధవారం పరిపూర్ణమయ్యాయి. ఆరు రోజులపాటు జరిగిన జాతర గజ వాహన సేవతో ముగిసింది. కల్యాణ శోభతో దివ్య మంగళ స్వరూపులుగా భక్తులకు దర్శనమిస్తూ పార్వతీ పరమేశ్వరుల ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి గజ వాహనంపై చెర్వుగట్టు, ఎల్లారెడ్డి గూడెం గ్రామాల్లో ఊరేగించారు. ఆలయ ప్రధాన అర్చకులు పోతులపాటి రామలింగేశ్వర శర్మ ఆధ్వర్యంలో వేద మంత్రోచ్చారణలు, సన్నాయి వాయిద్యాలతో, కోలాట బృందాలతో గ్రామోత్సవం కనుల పండుగగా కొనసాగింది. కార్యక్రమంలో దేవాదాయ సహాయ కమిషనర్ మహేంద్ర కుమార్, ఇన్‌చార్జి ఈఓ నవీన్, దేవాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మార్చి 14 వరకు పట్టభద్రుల ఓటరు నమోదు

సూర్యాపేట, ఫిబ్రవరి 21 : వరంగల్ – ఖమ్మం – నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదుకు 14 వరకు అవకాశం ఉన్నదని కలెక్టర్ ఎస్.వెంకట్రావ్ సూచించారు. కలెక్టరేట్‌లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సూర్యాపేట జిల్లాలో ఇప్పటి వరకు 47,291 మంది ఓటరుగా నమోదు చేసుకున్నారని తెలిపారు. రెవెన్యూ డివిజన్ల వారీగా సూర్యాపేటలో 24,039 మంది, కోదాడలో 11,167, హుజూర్‌నగర్‌లో 12,085 ఓటరుగా నమోదు చేసుకున్నారని చెప్పారు.

